# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

## నిలబడగలవా!



పులిగడ్డ చలమయ్య చుట్టపు చూపుగా అమరావతిలో అడుగు పెట్టడానికి కొంచెం ముందో, వెనకో గొప్ప ముసురు. మూడు రోజుల తుపానులో ఇళ్ళు పడిపోయినాయి. చెట్లు విరిగి పోయినాయి. తెరిపిచ్చింది. ఫరవాలేదనుకుంటే పులిగడ్డ చలమయ్య చేతి చలవ అనాలో, పాద ప్రతిభ అనాలో అవాంతరాలు ఒకటి తర్వాత ఒకటి వరసగా వచ్చి పడ్డాయి.

రామాలయం అరుగుమీద కూర్చుంటే పుల్లయ్య చలమయ్యని పలకరించి 'అయ్యా! ఆ గోడ పక్క స్థలం ఎవరిదీ?' అవడిగాడు.

చలమయ్య పుల్లయ్యని పైకీ, కిందకీ చూసి 'నువ్వు నిలబడతావా?' అనడిగాడు.

'అంటే? అన్నాడు పుల్లయ్య.'

'నువ్వు నిలబడతావా అన్నాను. నిలబడగలిగితే చెప్పు' అన్నాడు చలమయ్య.

'నిలబడమంటే నిలబడతాను' అన్నాడు అర్థం కాక పుల్లయ్య.

'నిలబడితే ఆ స్థలం నీదే' జేబులో పెట్టినట్టు తేల్చేశాడు చలమయ్య.

'అంటే' అని నోరెళ్ళబెట్టాడు పుల్లయ్య.

'అలా నోరు తెరవకు. ఇంటికెళ్ళి వంద పట్రా. గుంటూరు బస్సు రెడీగా వుంది. పద పోదాం అనట మేమి వందతో గుంటూరు వెళ్ళిపోయి, ప్రస్తుతం పోరంబోకుగా ఉన్న ఆ స్థలం మూడు తరాల క్రితం పుల్లయ్య వంశానికి చెందినట్టు కాగితం సృష్టించి, నోటీసులిప్పించి పత్రికల్లో ప్రకటనలు వేయించి, వూళ్ళో టముకు కొట్టించి దావా ఎవరూ ప్రతిఘటించక పోవడంతో, తను మరో ఐదొందలు జేబులో వేసుకుని ఆ స్థలాన్ని ఆర్నెల్లలో పుల్లయ్య చేతిలో పెట్టాడు.

ఆ తర్వాత చలమయ్య పులిగడ్డ వెళ్తానన్నా జనం వెళ్ళనివ్వలేదు. కేసుల్లేని రోజు లేదు. పడిపోయిన కేసుల్ని నిలబెట్టి ప్రాణం పోసి మీసం తిప్పేలా గెలిపించి ప్లీడర్లని హడలగొట్టించాడు.

ఈ లోపున మరో గృహ కల్లోలం వచ్చింది. సుందరయ్య అనే వ్యాపారస్తుడు వ్యాపార నిమిత్తం ఆ పట్నం, ఈ పట్నం తిరుగుతున్న సమయంలో అలివేలు అనే ఆవిడ ఆయనకు తటస్థపడ్డది. ఏం జరిగిందో మనకైతే తెలియదుగాని ఆవిణ్ణి తీసుకొచ్చి గుంటూరులో కాపురం పెట్టించి తను రోజూ గుంటూరు వెళ్ళి వస్తూండేవాడు. కొంతకాలానికి మరికొంచెం ధైర్యం చేసి అమరావతికే తీసుకొచ్చి కాపురం పెట్టి వ్యవహారం సాగించటం మొదలెట్టాడు. ఎదిగొచ్చిన కొడుకులు, కూతుళ్ళు, భూదేవిలాంటి భార్య అందరూ ఉన్నా, ఒక్కరూ నోరెత్తలేకపోయారు. వూరి పెద్ద కాబట్టి జనం ఎవరూ వేలెత్తలేకపోయారు. ఆఖరికి సుందరయ్య భార్య చలమయ్య దగ్గరకొచ్చి 'అన్నా' నా పసుపు కుంకుమ నిలుపు. నా సంసారం నిలబెట్టు అని ప్రాధేయ పడితే 'సరే' అని అభయమిచ్చాడు చలమయ్య.

ఆ సాయంత్రం సరాసరి అలివేలు ఇంట్లోకి వెళ్ళి 'అమ్మాయ్! అలివేలూ ఏమిటి అలా చూస్తావ్? మన సుందరాయ్ నా గురించి చెప్పలేదా... సరే తర్వాత తెల్లబోదువుగాని... ముందు కాసిని మజ్జిగ తీసుకురా...' అని తెచ్చిన మజ్జిగ తాగి 'ఇదిగో... నా మాట జాగ్రత్తగా విను. నువ్వు పరాయి పిల్లవైనా మా సుంద రాయ్‌కి కావలసిన దానివి అంటే, నాకు చెల్లెలితో సమానం. నీకిప్పుడు పెద్ద ప్రమాదం వచ్చింది.'

'అదేమిటండీ!' అంది అలివేలు భయంగా.

"మనుషులిష్టం లేకపోతే పోవచ్చు. కానీ ఖూనీలు, రక్తపాతాలు నాకు పడవు."

అలివేలు గుండెల మీద చెయ్యేసుకుంది.

"సుందరరామయ్య ఇరవై వేలదాకా ముట్టచెప్పాడా? నిన్నరాత్రి వజ్రపు టుంగరం స్వయంగా నీ చేతికి తొడిగాడా!"

'నిజం' అని ఆశ్చర్యపోయింది అలివేలు. ఆ ఉంగరం గురించి వాళ్ళిద్దరికీ తప్ప ఇంకెవరికీ తెలియక పోవడంతో చలమయ్య మీద నమ్మకం కుదిరింది.

'చెప్పండి... విషయం ఏమిటి?' బిక్కుబిక్కుమంటూ అడిగింది.

"చెప్పటమెందుకూ... ఆ కిటికీలోంచి చూడు" అన్నాడు చలమయ్య.

కిటికీలోంచి చూస్తే సంజె చీకట్లో చెట్ల వెనకాల నల్లగా మనుషులు తిరుగుతున్నారు. అలివేలుకి గుండె లవిసిపోయాయి.

"నీ విషయం సుందరాయ్ బావమరిదికి తెలిసింది. మీ ఆయన లేని సమయం చూసుకొని నిన్ను సఫా చెయ్యటానికి మనుషుల్ని తీసుకొచ్చాడు. ఆయిన దానివి కదాని ముందుగా చెప్దామని వచ్చా" అన్నాడు.

"నన్ను రక్షించండి బాబోయ్" అంటూ కాళ్ళమీద పడిపోయింది అలివేలు. 'కంగారు పడకు. నేను అన్ని ఏర్పాట్లు చేసే వచ్చా. దొడ్డి వాకిలి దగ్గర చిన్న కారుంది. క్షణంలో సర్దుకుని అందులో పడు. వెనక్కి చూడకు. ప్రాణాలు కాపాడుకో' అన్నాడు చలమయ్య.

మరు నిముషంలో అందిన సామానుతో కారులో పారిపోయింది అలివేలు. సరాసరి సుందరయ్య ఫ్యాక్టరీకి వచ్చాడు చలమయ్య. "సుందరయ్యా చెపితే విన్నావా? తెలియని వాళ్ళతో మనకు పొందు వద్దయ్యా అని నెత్తి నోరు పెట్టి మొత్తుకున్నానా. వాడెవడో మైసూరు నుంచి వచ్చాట్ట. ఆ ముండ చిన్నకారులో ఉడాయించేసింది" అన్నాడు.

"ఆ!" అన్న సుందరయ్యని చెయ్యి పట్టుకు లేవుకొచ్చి ఖాళీ ఇల్లు చూపించాడు చలమయ్య. ఆ మర్నాడు సుందరయ్య సతీసుత సమేతంగా గుళ్ళో అభిషేకం చేసుకుని పసుపునీళ్ళు నెత్తిన చల్లుకున్నాడు.

చలమయ్యకు ఆఖరి దశలో పక్షవాతం వచ్చింది. ఆ అదను చూసుకుని ఉన్న మూడెకరాలకూ వారసులు దావా వేశారు.

తను నిలబడలేదు. మాట కూడా పోయింది. 'హన్నన్నా!' అందర్నీ నిలబెడతావా? అని అని ఆ రోజుల్లో నిలబెట్టి నడిపించిన నేనే, ఈ దశలో నిలబడలేకపోతినే అని వాపోయాడు. మిగిలిన సగం ఆస్తితో తన కొడుకులనయినా నిలబెట్టమని దేవుడికి మొక్కాడు. ●